

అల్లాదుర్గం: వినాయకుడి శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న కళాబృందం



చిలిపిచెడ్: వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న యువకులు

# కనుల పండువగా శోభాయాత్ర

చిలిపిచెడ్/రామాయంపేట రూరల్/అల్లాదుర్గం, సెప్టెంబర్ 30: పదకొండు రోజుల పాటు విశేష పూజలందుకున్న గణనాథులకు మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు కనుల పండవగా శోభాయాత్రను నిర్వహించారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రమైన చిలిపిచెడ్, చండూర్, చిట్కుల్, శీలాంపల్లి, సోమక్కపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలను స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు. శోభాయాత్రలో ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

☛ రామాయంపేట రూరల్‌మండలంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా భక్తులు వినాయక విగ్రహాలను వివిధ రకాల డెకరేషన్లతో అలంకరించి వీధుల్లో ఊరేగించి, కోలాటాలు, భజనలు చేస్తూ గ్రామ శివారుల్లో చెరువుల్లో నిమజ్జనం చేశారు. పోలీసులు గస్తీ నిర్వహించారు.

☛ అల్లాదుర్గం మండంలో శనివారం వినాయక నిమజ్జనం కనుల పండువగా నిర్వహించారు. మండలంలోని చిల్వెరలో శ్రీ మహరాజ్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన బొజ్జ గణపయ్యను అందంగా అలంకరించి ప్రత్యేక వాహనంలో నిమజ్జనానికి తరలించారు. నిమజ్జనానికి ముందు నిర్వహించిన వేలంపాటలో అదే గ్రామానికి చెందిన రఫీ రూ.35 వేలకు లడ్డూను దక్కించుకున్నాడు. మహారాష్ట్రలోని లాతూర్ నుంచి వచ్చిన ప్రత్యేక కళా బృందాలు, బ్యాండ్ బృందాలు చేసిన ప్రత్యేక నృత్యాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. నిమజ్జనాన్ని తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.



దామరచెర్వులో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు



చిన్నగొట్టిముక్లలో ఆర్థికసాయం అందజేస్తున్న జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా

## బాధితులకు దాతల చేయూత

శివ్వంపేట, సెప్టెంబర్ 30: మండలంలోని బాధిత కుటుంబాలకు శనివారం దాతలు ఆర్థికసాయం అందజేశారు. చిన్న గొట్టిముక్ల గ్రామంలో ఇటీవల మృతిచెందిన పట్నం నర్సింలు కుటుంబాన్ని జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా పరామర్శించి రూ.5 వేలు అందజేశారు. శివ్వంపేటకు చెందిన దివ్యాంగుడు బాసంపల్లి స్వామిగౌడ్‌కు ఉపాధి నిమిత్తం కిరాణాషాపు పెట్టుకోవడానికి జడ్పీటీసీ రూ.20 వేల నగదు అందజేశారు. భీమ్లా తండా పంచాయతీ థౌర్యతండాలో కెతావత్ లక్ష్మణ్ మృతి చెందగా ఎంపీపీ కల్లూరి హరికృష్ణ రూ.5వేలు, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి రూ.5వేలు అందజేసి బాధితులకు అండగా నిలిచారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచులు బాలమణి నరేందర్, చెన్నానాయక్, ఎంపీటీసీ నువ్వుల దశరథ, గ్రామ పార్టీ అధ్యక్షులు దుర్గ్య, ఉప సర్పంచ్ విఠల్, డీలర్ పాపయ్యాచారీ, పట్నం శ్రీనివాస్, జగన్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## జలహనుమాన్‌కు ప్రత్యేక పూజలు

నర్సాపూర్, సెప్టెంబర్ 30: మండల పరిధిలోని పెద్దచింత కుంట గ్రామ సమీపంలోని జలహనుమాన్ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకం, అర్చన, తీర్థ ప్రసాదవితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్‌చారి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఏకలవ్య జయంతి వేడుకలు

నిజాంపేట, సెప్టెంబర్ 30: మండల కేంద్రం నిజాంపేటలోని నూతన బస్టాప్ వద్ద శనివారం మండల ఎరుకల సంఘం సభ్యులు ఏకలవ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం వారు ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో ఎరుకల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నర్సింహులు, సభ్యులు పోచయ్య, పరుశరాములు, ఎల్లయ్య, భాస్కర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




కిష్టాపూర్‌లో ఆధునీకరించిన ప్రభుత్వ పాఠశాలను ప్రారంభిస్తున్న సమగ్ర శిక్షా సెక్టోరియల్ అధికారిణి జ్యోతి

## 'మన ఊరు-మన బడి'తో స్కూళ్లకు మహర్దశ

తూప్రాన్, సెప్టెంబర్ 30: 'మన ఊరు–మనబడి'తో పాఠశాలకు మహర్దశ వచ్చిందని మెదక్ జిల్లా సమగ్ర శిక్షా సెక్టోరియల్ అధికారి జ్యోతి అన్నారు. శనివారం తూప్రాన్ మండలంలోని కిష్టాపూర్‌లో 'మన ఊరు – మన బడి'లో భాగంగా రూ.22 లక్షల వ్యయంతో ఆధునీకరించిన ప్రాథమికోన్నత పాఠశాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల్లో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తూప్రాన్ ఎంపీడీవో అరుంధతి, ఏంఈవో బుచ్యానాయక్, ఘనపూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్, సర్పంచ్ పోచయ్య, ఎంపీటీసీ సంతోష్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీశైలం, శ్యాంసుందర్ రెడ్డి, ఏఈ మధు, పాలకవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రేషన్ ఈ–కేవైసీపై ఆందోళన వద్దు

### రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి

రామాయంపేట, సెప్టెంబర్ 30: రేషన్ ఈ–కేవైసీపై ప్రజలు ఆందోళన చెందనవసరం లేదని, కచ్చితంగా ప్రతి ఒక్కరి రేషన్ కార్డులో తమ కుటుంబ సభ్యుల వివరాలను ఈ–కేవైసీ చేస్తామని రామాయంపేట రేషన్ డీల ర్ల సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి తెలిపారు. శనివారం కోనాపూర్‌లో ఈ–కేవైసీ చేసి రామాయంపేటలో మాట్లాడుతూ.. కొంత మంది వ్యక్తులు ఈ–కేవైసీపై దుష్ప్రచారం చేస్తున్నారని, అనవరంగా వారి మాటలు నమ్మి అమాయక ప్రజలు ఆందోళనకు గురికావద్దన్నారు. రేషన్ డీలర్ల అధ్వర్యంలో ప్రతి ఇంటికిగాని, కాలనీలో ఓ సెంటర్‌లో కూర్చుని ప్రతిఒక్కరి పేరును రేషన్ కార్డు ద్వారా ఈ–కేవైసీ చేస్తామన్నారు. మరో నెల రోజుల వరకు సమయం ఉందని, ఎలాంటి ఆందోళన చెందాల్సి పనిలేదన్నారు. మీ వార్డుకు, మీ ఏరియాకు వచ్చిన వెంటనే దండోరా వేయించి సమాచారం ఇస్తామన్నారు. ఆహార భద్రత కార్డులోని ఉన్న వారు కొంతమంది జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడం జరిగిందని వారి కోసం తెలంగాణ ప్రభుత్వం సంబంధిత అధికారి ఈ–కేవైసీ గడువును మరో నెలరోజుల పాటు పొడిగించడం జరిగిందన్నారు.



ఈ–కేవైసీ చేస్తున్న మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు



ఈ–కేవైసీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఈవో

## అర్హులందరికీ పంట రుణాలు మాఫీ

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 30: అర్హులైన రైతులకు పంట రుణమాఫీ అమలవుతుందని అన్నదాతలు ఆందోళన గురికావాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి లక్ష్మీప్రవీణ్ సూచించారు. శనివారం మండల పరిధిలోని రుద్రారంలో ఆయన రైతులకు పంట రుణమాఫీ ఈ–కేవైసీపై అవగాహన కల్పించారు. పంట రుణమాఫీ అయిన రైతులు మళ్లీ బ్యాంకుల్లో పంట రుణాలను తీసుకోవాలని సూచించారు. 2018 డిసెంబర్ 10లోపు బ్యాంకులో రుణం తీసుకున్న రైతులందరికీ పంట రుణమాఫీ వర్తిస్తుందని ఏవో తెలిపారు.



ఎలక్షన్స్‌పై వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

## ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన

మెదక్ అర్బన్, సెప్టెంబర్ 30: జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో 'ఎలక్షన్స్‌పై అవగాహన' కార్యక్రమం నిర్వహించినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో ఎలాంటి నాయకుడిని ఎంచుకోవాలని, ఎలాంటి నాయకుడికి ఓటువేయాలని విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 30: తల్లి మందలించిందని మనస్తాపంతో బావిలో దూకి ఓ యువకుడి ఆత్మహత్య చేసుకున్న ఘటన చిన్నశంకరంపేటలో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మెదక్ మండలం ఖాజిపల్లికి చెందిన మిర్జాపల్లి అనిల్ (19)ను ఖాళీగా ఉండకుండా ఏదైనా పని చేసుకోవాలని తల్లి మంగమ్మ మందలించడంతో మనస్తాపం చెంది అమ్మమ్మ గ్రామమైన రుద్రారంకు వచ్చి చిన్నశంకరంపేటలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాల పక్కన గల బావి లోపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు చిన్నశంకరంపేట ఎస్సై నారాయణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి తమ్ముడు దుర్గేశ్ ఉన్నాడు.



ఉద్యోగ విరమణ సందర్భంగా బోయ కృష్ణను సన్మానిస్తున్న నాగరాజుగౌడ్

## ప్రతి ఉద్యోగికి విరమణ తప్పదు

చేగుంట, సెప్టెంబర్ 30: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదని జిల్లా వెనుకబడుల తరగతి సహాయ అధికారి మంగా నాగరాజ్‌గౌడ్ పేర్కొన్నారు. చేగుంటలోని ప్రభుత్వబాలుర వసతి గృహంలో వంటమనిషిగా పనిచేస్తున్న బోయ కృష్ణ ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం కృష్ణ దంపతులను శాలువ పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగరాజుగౌడ్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు సేవ చేసి పదవీ విరమణ పొందుతున్న కృష్ణ అదృష్టవంతుడన్నారు. కృష్ణ చేసిన సేవలను వసతి గృహ సంక్షేమ అధికారి నవీన్ గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా బోయ సంఘం అధ్యక్షుడు మల్లయ్యతో పాటు వివిధ వసతి గృహ సంక్షేమ అధికారులు శ్రీనివాస్, సుజాత, మహేందర్‌రెడ్డి, ప్రణయ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.